నమస్తే తెలంగాణ
# నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, సోమవారం 3 ఫిబ్రవరి 2025 | NAGARKURNOOL

## టోర్నీని ప్రారంభించిన మాజీ మంత్రి



వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల, ఫిబ్రవరి 2 : జడ్చర్ల మున్సిపాలిటీలోని కావేరమ్మపేటలో ఆదివారం నుంచి వాలీబాల్ టోర్నీని నిర్వహించారు. ఈ పోటీలను మాజీ మంత్రి, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించారు. అనంతరం కావేరమ్మపేటలో డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద లబ్ధిదారుల గృహప్రవేశంలో ఆయన పాల్గొన్నారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీని వెంటనే రద్దు చేయాలి

రాజోళి, ఫిబ్రవరి 2 : మండల కేంద్రంలోని పెద్ద ధన్వాడలో ఏర్పాటు చేసే ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీని రద్దు చేయాలని గ్రామంలో చేపట్టిన దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. కార్యక్రమంలో ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.




ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు కోసం దీక్ష చేస్తున్న పెద్ద ధన్వాడ గ్రామస్తులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## జనగణనతోపాటు కులగణన చేయాలి

- జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలి
- ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి
- జాతీయ ఓబీసీ సలహాదారుడు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 2 : దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కులగణన కూడా చేసేందుకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని జాతీయ ఓబీసీ సలహదారుడు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బీపీ మండల్ మనుమడు ప్రొఫెసర్ సూరజ్ మండల్, జాతీయ ఓబీసీ నాయకులు, తమిళనాడు రాజ్యసభ సభ్యుడు విల్సన్, ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌తో కలిసి ఓబీసీ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జనగణనతోపాటు కులగణన చేసే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు కేటాయించి, చట్టబద్ధత కల్పించాలన్నారు. సాకులు చెప్పి తప్పించుకుంటే, ఓబీసీలు దేశవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. అదేవిధంగా విద్యా ఉద్యోగం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేట్ సెక్టార్లలో రిజర్వేషన్లు కల్పించి, ఓబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని కేంద్రానికి వివరించాలన్నారు. దీని కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ఆయన సూచించారు.

## ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద, ఫిబ్రవరి 2 : పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని విఠలాపురం గ్రామ బీఆర్‌ఎస్ కార్యకర్త గుట్టలి గోపాల్ ఇటీవల మృతి చెందగా పార్టీ నుంచి రూ.2లక్షల బీమా చెక్కులను మాజీ ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు సుభాష్, మాజీ ఎంపీపీ బక్క నర్సప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, నాయకులు క్యాసారం భీంరెడ్డి, పరశురాం రెడ్డిపాల్గొన్నారు.



బీమా చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఆర్‌రెడ్డి



ధర్నా చేస్తున్న బాలుడి కుటుంబసభ్యులు

## బాలుడి మృతదేహంతో ధర్నా

జడ్చర్ల, ఫిబ్రవరి 2 : జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ గ్రామసమీపంలోని ఉదండాపూల్ ప్రాజెక్టు గుంతలో పడి శనివారం గల్లంతైన బాలుడు మహేశ్ మృతదేహం ఆదివారం లభించింది. మృతుల కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాలుడి మృతదేహంతో ఉదండాపూల్ గ్రామం దగ్గర రోడ్డుపై రాస్తా రోకో నిర్వహించారు. ప్రాజెక్టు కోసం తవ్విన గుంతల వలననే తమ పిల్లలు మృతి చెందారని రూ.30లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు రోడ్డుపై నుంచి కదిలేది లేదని అలాగే బైఠాయించారు. విషయం తెలుసుకున్న జడ్చర్ల సీఐ ఆది రెడ్డి ఎస్సై శివానందంలు అక్కడి చేరుకొని పరిస్థితి సమీక్షించారు. ప్రాజెక్టు సంబంధించిన కాంట్రాక్టర్లను పిలిపించి వారితో మాట్లాడారు. చివరకు కాంట్రాక్టర్ రూ.10లక్షలు చెల్లించేందుకు ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు.

## హడలెత్తిస్తున్న గంజాయి బ్యాచ్

- యువకుడి దాడిపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు
- పరస్పరం కత్తులతో దాడులు
- భయపడుతున్న ప్రజలు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 2 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గంజాయి బ్యాచ్ హడలెత్తిస్తున్నది. ఈ బ్యాచ్ పట్టణంలో రాత్రి అయితే చాలు ఎవరి పైనంటే వారిపై దాడులు చేస్తూ అడ్డూ అదుపు లేకుండా వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో గంజాయి బ్యాచ్ పాలమూరు పట్టణంలోని ఓ యువకుడిపై దాడి చేసిన ఘటన మరవకముందే మరో ఘటనలో రెండురోజుల కిందటే మహబూబ్‌నగర్ టుటౌన్ పోలీసులకు చిక్కారు. రెండు రోజుల కిందట న్యూటౌన్‌లోని గంజాయి బ్యాచ్ ఒకరిపై ఒకరు పదునైన ఆయుధాలతో దాడులకు పాల్పడుతుండగా స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహబూబ్‌నగర్ డీఎస్పీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. రెండు రోజుల కిందట గంజాయి బ్యాచ్ గతంలోనూ పలు అరాచకాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. గంజాయి బ్యాచ్ ఆగడాలపై ఎస్పీ జానకి సీరియస్‌గా ఉన్నట్లు పోలీసులు అంటున్నారు. వారం కిందట ఖిల్లా ఘణపూర్‌లో ఎస్పీ రూ.83లక్షలు 12వేల గంజాయిని దహనం చేశారు. మరో సారి విని యోగించకుండా చర్యలు తీసుకుంటున్నా కొద్దిమంది యువకులు మళ్లీ గంజాయికి బానిసలవుతున్నారు.

**రాత్రివేళలో విచ్చలవిడిగా..**

రాత్రివేళలో యువత విచ్చలవిడిగా తిరిగి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ దారిన పోయే వారిపై దాడి చేస్తున్న ఘటనలు, దొంగతనాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఈ ఘటనలో కొందరు యువకులు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి తాగుతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకొని విచారణ మొదలు పెట్టారు. అయితే వారు గంజాయి మత్తులోనే గొడవలు, దొంగతనాలకు పాల్పడుతున్నారని, గంజాయికి బానిసగా మారిన యువత దాని కోసం ఆత్మహత్యకు సైతం దిగుతుండడం పోలీసులకు విస్మయానికి గురిచేసింది. ఏకంగా పోలీసుల విచారణలో గంజాయికి అలవాటుపడిన ఓ యువకుడు నేరుగా ఒప్పుకోవడం, మత్తు కోసం సూసైడ్ చేసుకునేందుకు సిద్ధమవడం కూడా మనం చూస్తున్నాం. దీంతో పోలీసులు గంజాయి రవాణాపై దృష్టి పెట్టారు. యువత చెడుదారుల్లో పయనించడం, గొడవలకు దిగడం, రాత్రి వేళలో విచ్చలవిడిగా తిరుగుతుండడం పోలీసుల నిఘాలో తెలింది. దీంతో ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. ప్రాథమిక విచారణలోనే జిల్లాలో విస్తరించిన గంజాయి సరఫరా ముఠా తిష్ట వేసినట్లు పోలీసులు ఆఫ్ ది రికార్డుగా చెబుతున్నారు. ప్రధానంగా కళాశాలల యువత గంజాయి మత్తులో జోగుతున్నారు. పట్టణంలోని బండమీదిపల్లి, బస్టాండ్, మార్కెట్ యార్డు, శ్రీనివాసా కాలనీ పార్కు ఏరియాతోపాటు ఇతర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇక గంజాయి సరఫరా చేసే ముఠా జిల్లాను టార్గెట్ చేసింది. కొన్ని ప్రాంతాల్లో నిర్దిష్ట సమయాలను ఎంచుకొని అమ్మకాలు సాగిస్తున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు గంజాయి అమ్మకం సాగిస్తున్నట్లు తెలుస్తున్నది. అదేవిధంగా ప్రకాశం, గుంటూరు, నల్గొండ, కర్నూల్ ప్రాంతాల నుంచి కూడా గంజాయి విచ్చలవిడిగా వస్తున్నట్లు సమాచారం.

**యువకుడిపై కత్తితో దాడి..**

కొన్ని రోజుల కిందట రూరల్ పోలీసు స్టేషన్ సమీపంలోని ఓ బార్ వద్ద టీచర్స్‌కాలనీకి చెందిన వెంకటరెడ్డిపై గంజాయి మత్తులో మక్బూల్, సోఫియాన్ పదునైన ఆయుధాలతో దాడిచేసి నారాయణపేటకు పారిపోయారు. దాడి ఘటనపై బాధితుడు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై గంజాయి బ్యాచ్ యువకుడిపై దాడి అని 'నమస్తే తెలంగాణ'లో వార్త ప్రచురించడంతో పోలీసులు వెంటనే కేసు నమోదు చేశారు. అరబ్‌గల్లికి చెందిన మక్బూల్, సోఫియాన్, కోయిలకొండ మండలం రాంపూర్‌కు చెందిన మతీన్ ముగ్గురు స్నేహితులు. శుక్రవారం మక్బూల్ మహబూబ్‌నగర్‌కు రాగా సోఫియాన్, మతీన్ కలిసి ముగ్గురు రాత్రి అరబ్‌గల్లిలో మద్యం తాగారు. అర్ధరాత్రి దాటాక రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు విషయంలో వారిమధ్య వాగ్వాదం జరిగింది. దాడి కేసులో ఉన్న మక్బూల్ ఒక్కడే పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలని మతీన్ సూచించాడు. దీంతో కోపంతో మక్బూల్ కత్తితో మతీన్‌పై దాడి చేయగా అతడికి వీపు భాగంలో స్వల్ప గాయమైంది. గమనించిన పోలీసులు గొడవపడుతున్న వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



భూత్పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

- పునరావాసం కోసం భూత్పూర్ ముంపు గ్రామస్తుల ఎదురు చూపులు
- అభివృద్ధి కోసం భూములిస్తే.. పునరావాసం కోసం పరిహాసమాడుతున్న ప్రభుత్వం
- ఊరి పోరగాళ్లకు పిల్లనివ్వడం లేదని గ్రామస్తుల ఆవేదన
- శవాలను పూడ్చేందుకు తప్పని అవస్థలు
- మొసళ్లు, పాములు, విష కీటకాలతో నిర్వాసితుల ఆవాసం

# హామీ నెరవేరేనా..?

ఊట్కూర్, ఫిబ్రవరి 2 : నారాయణపేట జిల్లా మక్తల్ మండలం భూత్పూర్ నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నది. రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకంలో భాగంగా గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 1.313 టీఎంసీ సామర్థ్యంతో 46,800 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించేందుకు గ్రామం పక్కనే రిజర్వాయర్ నిర్మాణం జరిగింది. భూత్పూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించిన అప్పటి ప్రభుత్వం నిర్వాసితులను ఆదుకునేందుకు 122 జీవోను ప్రకటించింది. రిజర్వాయర్‌లో భూములను కోల్పోయిన గ్రామస్తులకు పరిహారం అందించగా తల దాచుకునేందుకు పునరావాసం కల్పించడంలో నాటి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్న ఆరోపణలు ఉన్నాయి. అభివృద్ధి కోసం తాము భూములిస్తే పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం పరిహాసమాడుతున్నదని గ్రామస్తులు మండిపడుతున్నారు. 2005లో రిజర్వాయరు ప్రారంభించిన ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2010 లోనే భూత్పూరు ముంపు గ్రామంగా ప్రకటించి జీవో విడుదల చేసింది. ముంపు గ్రామస్తులకు ఇండ్ల నిర్మాణం కోసం సర్వే చేపట్టక పోవడంతో నిర్వాసితులకు గూడు కరువై హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి నగరాలకు వలస వెళ్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యానికి గురైన వారు ఎక్కడికి వెళ్లలేక శిథిలమైన ఇండ్లలోనే తల దాచుకుంటూ కష్టాలను అనుభవిస్తున్నారు. నది పక్కనే గ్రామం ఉండడంతో వర్షం వస్తే మోకాళ్ల లోతు నీరు చేరి అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితిని ప్రజలు అనుభవిస్తున్నారు. ఇంటి గోడలకు తేమ పట్టి నెర్రలు పోతున్నాయని, దూలాలు చెదలు తిని శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నేలపై పడుకునేందుకు వీలు లేకుండా దుప్పట్లు, జంకానాలు తడిసి ముద్దవుతున్నాయని గ్రామస్తులు తమ దీనావస్థను వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు వచ్చి రిజర్వాయర్ నిండితే ఇండ్లల్లోకి మొసళ్లు, పాములు, విష కీటకాలు వచ్చి చేరుతున్నాయి. తమ గ్రామం లో లెక్కకు మించి పాముకాటు మరణాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రాత్రి, పగలు కంటి మీద కునుకు లేకుండా గ్రామస్తులు కాలం గడుపుతున్నారు. పునరావాసం కోసం ఎదురు చూసిన ఎంతో మంది మానసిక క్షోభతో ప్రాణాలు కోల్పోయారు. పక్కనే రిజర్వాయర్ ఉండడంతో బోరు బావుల నుంచి కలుషితమైన నీటిని తాగి ఇరవై శాతానికిపైగా గ్రామస్తులు కిడ్నీ ఫెయిల్యూర్‌తో బాధపడుతున్నారు. గ్రామంలో కనీస మౌలిక వసతులు లేక రోగాలతో సతమతమవుతున్నారని, పట్టించుకునేందుకు అధికారులు ముందుకు రావడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గ్రామానికి పడమటి వైపున రిజర్వాయర్, ఉత్తరాన పెద్ద చెరువు, దక్షిణం వైపున కల్వాల చెరువు, మరో వైపు పొలాలు ఉండటంతో చని పోయిన శవాలను పాతి పెట్టేందుకు గోతులు తీస్తే ఊట నీరు వస్తుందని, శవాలను సైతం పూడ్చుకో లేక పోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో పరిస్థితులు ఇలా ఉంటే యువకులకు పెళ్లి వయస్సు దాటి పోతున్నా పిల్లనిచ్చేందుకు బంధువులు ముందుకు రావడం లేదని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



భూత్పూర్‌లో శిథిలావస్థకు చేరిన షెడ్ల నిర్మాణాలు



తలుపులో పాములు దూరకుండా తట్టు అడ్డంగా ఉంచిన దృశ్యం



నివాసం ఉంటున్న ఇంట్లో తేమపట్టిన నేలభాగం

**దళారుల జోక్యంతో జీవో ఫైల్ పెండింగ్..**

దళారులు జోక్యం వల్లే భూత్పూర్ రిజర్వాయర్ ముంపు గ్రామం నిర్వాసితులకు సంబంధించిన 122 జీవో ఫైల్ పెండింగ్‌కు కారణమైనట్లు కొందరు నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీ లెక్కల ప్రకారం గ్రామంలో దాదాపు 500 నివాస గృహాలు 1500 మంది జనాభా ఉండగా గత ప్రభుత్వం గ్రామస్తులకు పునరావాసం కోసం కమిటీని ఏర్పాటు చేసింది. గ్రామంలో పలుకుబడి ఉన్న లీడర్లు, మధ్య దళారులు జోక్యం చేసుకొని ఇతర గ్రామాలకు చెందిన బంధువులు, సంబంధీకుల పేర్లను నమోదు చేయించి కొత్తగా షెడ్ల నిర్మాణం చేపట్టినట్లు గుర్తించింది. రెట్టింపు సంఖ్యలో లబ్ధిదారులను చేర్చడంతో అసలైన నిర్వాసితులకు సమస్యను తెచ్చి పెట్టిందన్న ఆరోపణలు ఉన్నాయి. రికార్డులు తారుమారుకు పాల్పడటంతో నిర్వాసితుల జీవో ఫైల్‌ను కమిటీ తిరస్కరించిందని అధికారులు చెబుతున్నారు. కొత్తగా నిర్మించిన షెడ్ల నిర్మాణానికి పరిహారం అందించడం సాధ్యం కాదని ఫైల్‌ను పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది.

**మంత్రి జూపల్లి హామీ నెరవేరేనా..**

భూత్పూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయి పునరావాసం కోసం ఎదురు చూస్తున్న బాధిత గ్రామస్తులను ఆదుకుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి విజ్ఞప్తి మేరకు గత నెల 13న భూత్పూర్ గ్రామాన్ని మంత్రి సందర్శించి స్వయంగా సమస్యలను పరిశీలించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఆరు నెలలు ఎన్నికల సందర్భంగా అభివృద్ధి పనులు చేపట్టలేక పోయామని గ్రామస్తులతో పేర్కొన్నారు. 24 ఏండ్ల రాజకీయ ప్రస్థానంలో మీరు అనుభవిస్తున్న కష్టం హృదయాన్ని కలిచివేస్తోందని, ఇరవై ఏండ్లుగా సమస్యలతో పోరాటం చేస్తున్న గ్రామస్తుల సహనానికి దండం పెడుతున్నట్లు మంత్రి చెప్పుకొచ్చారు. పాలమూరు ముద్దు బిడ్డ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం అదృష్టంగా భావించాలని, పునరావాసం కోసం వారం రోజుల్లో భూ సేకరణ పూర్తి చేయించి ఒక్కో కుటుంబానికి 200 గజాలతో ఇంటి నిర్మాణం చేపట్టేందుకు నివేదికలు తయారు చేయాలని అదనపు కలెక్టర్ బెన్ షాలెం, ఆర్డీవో రాంచందర్‌నాయక్‌ను ఆదేశించారు. మంత్రి పర్యటన పూర్తయి పక్షం రోజులు గడచినా అధికారులు భూ సేకరణ కోసం చర్యలు ప్రారంభించకపోవడంతో నిర్వాసితులు ఎదురు చూస్తున్నారు.

### ఊరి పోరగాళ్లకు పిల్లనివ్వడం లేదు..



"గ్రామంలో కనీస వసతులు లేకుండా జీవిస్తున్నాం. అడవిలో ఉండే చెంచు జాతుల కంటే హీనంగా మా బతుకులు ఉన్నాయి. రిజర్వాయర్ కింద భూములు కోల్పోవడంతో పండించుకునేందుకు పంటలు లేకుండా పోయింది. ఇది తెలుసుకుని మా ఊరి పోరగాళ్లకు పిల్లనిచ్చేందుకు బంధువులు సైతం ముందుకు రావడం లేదు. భూసేకరణ చేపట్టి ప్రభుత్వం ఇప్పటికైనా ఇండ్ల నిర్మాణం చేపట్టాలి."

– మీసాల అంజప్ప, భూత్పూర్ నిర్వాసితుడు

### నా భార్య కిడ్నీ ఫెయిల్యూర్ అయ్యింది..



"పక్కనే రిజర్వాయర్ ఉండడంతో బోరు బావుల నుంచి వచ్చే కలుషిత నీటిని తాగి నా భార్యతో సహా అనేక మంది గ్రామస్తులు కిడ్నీ ఫెయిల్యూర్‌తో బాధ పడుతున్నారు. పాము కాటుకు గురై లెక్క లేనంత మంది చని పోతున్నారు. ఊర్లోని ప్రజలందరూ భయంతో బతకాల్సి వస్తోంది. కొత్త గ్రామం ఏర్పాటు చేసి త్వరగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేయించాలి."

– పింజరి బాలేసాబ్, భూత్పూర్

### తిండి గింజలకు భద్రం లేదు..



"రిజర్వాయర్ పక్కనే ఇండ్లు ఉండడంతో ఊట నీరు ఇండ్లల్లోకి చేరుతుంది. దీంతో తిండి గింజలకు సైతం భద్రం లేకుండా ఉన్నది. వర్షం వస్తే గింజలు, దుస్తువులు తడిసిపోతున్నాయి. ఇల్లంతా తేమ తీసుకోవడంతో ఆరుబయట హాలులోనే ఇంటిల్లిపాది కూర్చొని వంటలు వండుకోవాల్సి వస్తుంది. మా సమస్యలకు త్వరగా పరిష్కార మార్గం చూపెట్టాలి.."

– జయమ్మ, గృహిణి, భూత్పూర్

## నేటినుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు

- ఈ నెల 22వ తేదీ వరకు మొత్తం నాలుగు విడుతల్లో పరీక్షల నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఐఈవో కౌసర్‌జహాన్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 2 : మహబూబ్‌నగర్ జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఎంపీసీ, బైపీసీ ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులతోపాటు ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు ప్రయోగ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించడంతో పాటు ఇంటర్‌బోర్డు అధికారులు అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈసారి అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘానీడలో పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నా ప్రైవేటు కళాశాలల యాజమాన్యం వ్యతిరేకిస్తున్నాయి.

**మొత్తం నాలుగు దశల్లో..**

మొదటి దశ ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు, రెండో దశ ఈ నెల 8నుంచి 12వ తేదీ వరకు, మూడో దశ ఈ నెల 13నుంచి 17వ తేదీ వరకు, నాలుగో దశ పరీక్షలను ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించనున్నారు. హాల్ టికెట్లు ముద్రించిన తేదీలు, సమయాన్ని బట్టి విద్యార్థులు హాజరు కావాల్సి ఉంటుంది. జిల్లా ఇంటర్ అధికారులు, జిల్లా పరీక్షల కమిటీని, ప్రత్యేకంగా ఫ్లయింగ్‌స్క్వాడ్లను ఏర్పాటు చేశారు.

**సీసీ కెమెరాలపై వీడని సందిగ్ధం..**

ప్రయోగ పరీక్షలను సీసీ కెమెరాల నిఘానీడలో నిర్వహించాలనే ప్రభుత్వ నిర్ణయంపై సందిగ్ధత కొనసాగుతున్నది. ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల పరీక్షా కేంద్రాల్లో అధికారులే ప్రయోగశాలలు, ఆవరణల్లో సీసీ కెమెరాలను రెండు రోజులుగా అమర్చేపనిలో నిమగ్నమయ్యారు. ప్రైవేట్ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంపై ఆయా కళాశాలల యాజమాన్యాలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రభుత్వ సంస్థల పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటులో జనరల్ 13, ఒకేషనల్ 3 కేంద్రాలు ఏర్పాటు చేసినా.. వాటిలో ప్రభుత్వం నిర్దేశించిన తరహాలో వీడియో, ఆడియో రికార్డింగ్ ఎంత వరకు పనిచేస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే ఈ విషయంలో తాము సహకరించబోమని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు రాష్ట్ర, జిల్లా స్థాయిలో అధికారులకు వినతులు సమర్పించాయి. దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. జిల్లావ్యాప్తంగా మొత్తం 12, 109 మంది విద్యార్థులు జనరల్, ఒకేషనల్ ప్రయోగ పరీక్షలు రాయనున్నారు. ఇందుకు 42పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనరల్ ప్రయోగ పరీక్షలు 8,392 మంది విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు 3,717 మంది పరీక్షలు రాయనున్నారు.

### పకడ్బందీగా పరీక్షలకు ఏర్పాట్లు

అన్ని వసతులు ఉన్న కళాశాలలనే పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశాం. విద్యార్థులు హాల్‌టికెట్లను కళాశాలల లాగిన్‌లో, బోర్డు వెబ్‌సైట్ ద్వారా నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏమైనా సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నం.9240205555ను సంప్రదించవచ్చు. ప్రభుత్వ విద్యా సంస్థల కళాశాలల్లో సీసీ కెమెరాలు అమర్చాం. ప్రైవేటు కళాశాలల కేంద్రాల్లోనూ సీసీ కెమెరాల నిఘా నీడలోనే పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రైవేటు కళాశాలలు హాల్‌టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం.

– కౌసర్ జహాన్, జిల్లా ఇంటర్ విద్యాధికారి, మహబూబ్‌నగర్

### చెప్పు కోసం వెళ్లి మహిళ మృతి

మూసాపేట(అడ్డాకుల), ఫిబవరి 2 : మండలంలోని కాటవరం గ్రామానికి చెందిన గొల్ల రాజు, శిరీష(32) భార్యాభర్తలు. జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లారు. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వారు హైదరాబాద్‌శామీర్‌పేటలో 3వ అంతస్థులో నివాసం ఉంటున్నారు. పిల్లలు ఆడుతూ చెప్పులు విసరడంతో విద్యుత్ వైర్లకు తగిలి ఆగినట్లు చెప్పారు. ఆ చెప్పలను తీస్తుంటుడగా ఆమెకు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు తెలిపారు.